రాత్రి వేళల్లో సెక్యూరిటీ పెంచాలి



రాత్రి వేళల్లో ఒక సెక్యూరిటీ గార్డు మాత్రమే ఉంటున్నాడు. కొత్తగా నిర్మించిన యలమంచిలి సీహెచ్‌సీ పట్టణానికి దూరంగా ఉంది. డ్యూటీలో ఉన్న వైద్యులు, మిగతా సిబ్బంది భయపడుతూ విధులు నిర్వర్తిస్తున్నారు. మరింత భద్రత పెంచితే ధైర్యంగా విధులు నిర్వర్తించగలుగుతాం. కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై హత్యాచారం వైద్యులు, సిబ్బందిని భయాందోళనలకు గురిచేసింది. ప్రభుత్వాలు మాకు ధైర్యాన్నిచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఆర్.నిహారిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, యలమంచిలి సీహెచ్‌సీ

భద్రత ముఖ్యం



కోల్‌కతాలో పీజీ విద్యార్థినిపై జరిగిన ఘటన అందర్నీ భయాందోళనలకు గురిచేసింది. అలాంటివి పునరావృతం కాకుండా విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించాలి. ముఖ్యంగా నేర స్వభావం ఉన్న వ్యక్తులు ఆస్పత్రుల వైపు రావాలంటేనే భయం ఉండేలా చూడాలి. మహిళా సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తే ఇంకా మంచిది. రాత్రి వేళల్లో ఆస్పత్రికి వచ్చే వారిలో ఎక్కువ మంది మద్యం మత్తులో ఉంటున్నారు.

– డాక్టర్ మౌనిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్, యలమంచిలి సీహెచ్‌సీ

వైద్యుల రక్షణకు పటిష్ట చర్యలు



ప్రజల ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం నిస్వార్థంగా పనిచేసే వైద్యుల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం కొన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించి వైద్యులకు భరోసా కల్పించాలి. ప్రధానంగా మహిళా డాక్టర్ల రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుని కఠినంగా వ్యవహరించాలి. డ్యూటీ డాక్టర్లకు విశ్రాంత గదుల ఏర్పాటుతో పాటు సీసీ కెమెరాలు అమర్చాలి.

– డాక్టర్ సంతోష్‌కుమార్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కె.వెంకటాపురం, కోటవురట్ల మండలం

యలమంచిలి రూరల్/కోటవురట్ల

క్లుప్తంగా

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



కోటవురట్లలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేస్తున్న సిబ్బంది

కోటవురట్ల: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందస్తుగా నివారణ టీకాలు వేస్తున్నట్టు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సింహాద్రప్పడు తెలిపారు. స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో శుక్రవారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా పశు సంవర్ధక శాఖ ద్వారా పశువులకు ఉచితంగానే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 18వ తేదీ వరకు నిర్వహిస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్ఏ జి.శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరికి ఘన నివాళి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కోటవురట్ల: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజుపేట ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం టంగుటూరి చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సమాజాభివృద్ధికి యువత పాటు పడాలని ఉపాధ్యాయులు కోరారు.

హెచ్ఐవీ నియంత్రణకు కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ ప్రతినిధులు

మాడుగుల రూరల్: ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని లింక్ వర్కర్ స్కీమ్ సీఎల్‌డబ్ల్యూసీ పి. సూర్యకళ తెలిపారు. ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వీరవల్లి అగ్రహారంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ యలగాడ ఈశ్వరమ్మ, ఈశ్వరావు, పంచాయతీ కార్యదర్శి జగదీష్, సీహెచ్‌వో మాధురి తదితరులు పాల్గొన్నారు.

వెనుబడిన విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు



విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

నర్సీపట్నం: ఈ ఏడాది టెన్త్‌లో శతశాతం ఫలితాలు సాధించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో అప్పారావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న పలు అంశాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల పఠన సామర్థ్యాన్ని పరిశీలించారు. నోట్ పుస్తకాలను తనిఖీ చేశారు. ఇంగ్లిష్‌లో నూటికి నూరు శాతం మార్కులు సాధించేందుకు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సైన్స్ బోధన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల స్థాయిని బట్టి బోధన చేయాలని సూచించారు. విద్య బోధన, మధ్యాహ్న భోజనం సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలని హెచ్ఎం రామకృష్ణారావుకు సూచించారు.

ఈ-పంటతో బహుళ ప్రయోజనాలు

- క్షేత్ర స్థాయిలో సాగు వివరాల నమోదు
- ఈ-పంట నమోదు గడువు సెప్టెంబర్ 15

నియోజకవర్గంలో పంటల సాగు ఇలా..

మండలం	పంటల సాగు (ఎకరాల్లో..)
మునగపాక	10,245
అచ్యుతాపురం	8,463
రాంబిల్లి	17,465
యలమంచిలి	7,654

మునగపాక: ఆరుగాలం శ్రమించే రైతులను నిరంతరం కష్టాలే వెంటాడుతున్నాయి. విత్తనం నాటినప్పటి నుంచి పంట చేతికి అందివచ్చేంత వరకు భరోసా ఉండదు. అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు నష్టాల బారిన పడుతూనే ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో పరిహారం పొందేందుకు రైతులకు అవస్థలు తప్పడం లేదు. వేలాది రూపాయలు పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుంది. వ్యవసాయం అంటేనే ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటిల్లపాది కష్టపడి సాగు చేస్తున్నా ప్రకృతి వైపరీత్యాల కారణంగా అప్పుల తిప్పలు తప్పడం లేదు.

జోరుగా ఈ-పంట నమోదు

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటకు నష్టం వాటిల్లితే ఆదుకునేందుకు ఈ-పంట నమోదు దోహదపడుతుంది. ఈ-పంట నమోదు ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. పంట పరిహారంతో పాటు ఇతర పథకాలకు కూడా ప్రభుత్వం ఈ-పంట నమోదు తప్పనిసరి చేసింది. రైతు తాను పండించిన పంటను తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంది. రైతు పండించే పంటతో పాటు ఆధార్ కార్డు, వన్‌బీ, రేషన్ కార్డు, బ్యాంకు వివరాలను అధికారులకు అందించాలి. ఏ సర్వే నంబరులో ఏ పంట వేశారో గుర్తించి క్షేత్రస్థాయిలో ఫొటో తీసే ప్రక్రియ ప్రస్తుతం జోరుగా సాగుతోంది. వీఆర్వో, వ్యవసాయ శాఖ సహాయకులు, గ్రామ సర్వేయర్లు ఈ-పంట నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఈ-పంట నమోదు జోరుగా సాగుతోంది. సెప్టెంబర్ 15వ తేదీని గడువుగా నిర్ణయించారు.



మునగపాకలో ఈ-పంట నమోదు చేస్తున్న అధికారులు

లాభాలు ఇలా..

ఈ పంట నమోదుతో రైతులకు పలు లాభాలు చేకూరనున్నాయి. పెట్టుబడులకు ఉపయోగపడేలా సున్నా వడ్డీ రుణాలు, కనీస మద్దతు ధర, ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల నష్ట పరిహారం వంటి పథకాలకు ఈ-పంట ద్వారా అమలు చేస్తారు. అన్నదాత సుఖీభవ వంటి పథకం కూడా వర్తించాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి చేశారు.

ఈ-పంటపై అవగాహన అవసరం



ఈ-పంట నమోదుపై రైతులకు అవగాహన అవసరం. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పంట పొలాల వద్దకు వచ్చి వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ-పంట నమోదు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. రైతులకు ఇలాంటి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది.

– బొడ్డేడ సూరప్పారావు, రైతు, అరబుపాలెం

రైతులు సహకరించాలి



ఈ-పంట నమోదు ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. పంట కొనుగోలు, సున్నా వడ్డీ, కనీస మద్దతు ధర, ప్రకృతి వైపరీత్యాల సాయం తదితర పథకాలకు ఈ-పంట నమోదు తప్పనిసరి. ప్రతి రైతు ఈ-పంట నమోదుకు సహకరించాలి.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, మండల వ్యవసాయాధికారి

జగన్ రాక కోసం..





- ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద ఎదురు చూసిన జనం

ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద తన కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్

అనకాపల్లి: రాంబిల్లిలోని ఎసైన్షియా ఫార్మా ప్రమాదంలో గాయపడి వారిని పరామర్శించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకున్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్థానిక ఉషా ప్రైమ్ ఆస్పత్రి వద్ద ఆయన రాక కోసం గంటలకొద్దీ ఎదురు చూశారు. ఈ క్రమంలో ఉదయం 10.30 గంటలకు రావడంతో మా సీఎం జగన్‌మోహన్‌రెడ్డే అంటూ నినాదాలు చేశారు. ప్రజలు నేరుగా మాజీ సీఎం జగన్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు అడ్డుకోలేకపోయారు. అయినప్పటికీ ఆస్పత్రిలోకి చొచ్చుకుని పోయేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఎంట్రన్స్ గేటులకు తాళాలు వేశారు. అప్పటికే కొంతమంది ప్రజలు చుట్టుపక్కల మేడలపై నుంచి ప్రజల సంక్షేమ రథసారథి.. జగనన్నకు జిందాబాద్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ నాయకులు బొడ్డేడ శివ, కలగ గున్నయ్యనాయుడు, బి.లక్ష్మీనరసింహరావు, పెదిశెట్టి గోవింద్, ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, మరిపల్లి శోభ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీహరి

మునగపాక: భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని శాస్త్రవేత్త శ్రీహరి తెలిపారు. మండలంలోని ఒంపోలులో శుక్రవారం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగులో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వినియోగించరాదన్నారు. పంటలకు ఎరువులు ఎలా వేయాలనే విషయమై అవగాహన కల్పించారు. వరి మొదటి దశలో 50 కిలోల డీఏపీ, 20 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ చొప్పున ఎరువులు వినియోగించాలన్నారు. వ్యవసాయంలో మరింత సమాచారం కోసం రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నంబర్ 1800-4198800లో సంప్రదించాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూతూమంత్రంగా గ్రామసభలు



ఏటికొప్పాక గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీవో అప్పలనాయుడు



నక్కపల్లి మండలం వేంపాడులో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): ప్రభుత్వం ఎంతో అట్టహాసంగా శుక్రవారం నిర్వహించిన గ్రామసభలు తూతూమంత్రంగా జరిగాయి. మండలంలో కొత్తూరు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ పాల్గొని గ్రామంలో అభివృద్ధి పనులపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు సహకరించాలని కోరారు.

ఎస్.రాయవరం: మండలంలోని 28 గ్రామాల్లో ప్రత్యేకాధికారుల సమక్షంలో గ్రామసభలు నిర్వహించారు. గుడివాడలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, వేమగిరిలో ఐకేపీ ఏపీఎం శివప్రసాద్, కొరుప్రోలు ఏపీఎం సత్యవతి తదితరులు గ్రామ సభలు నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా త్వరలో గ్రామాల్లో చేపట్టబోయే పనులపై చర్చించి తీర్మానాలు చేశారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపు

పాయకరావుపేట: మండలంలోని 24 గ్రామాల్లోను గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులు గుర్తించినట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. గ్రామాల్లో చేపట్టవలసిన పనులను ఆయా గ్రామాల రికార్డుల్లో నమోదు చేస్తామన్నారు.

యలమంచిలి రూరల్: మండలంలోని 17 పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. రాబోయే ఐదేళ్లలో ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టనున్న ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించినట్టు యలమంచిలి ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఏటికొప్పాక, బయ్యవరం, పీఎస్ఆర్ పేట, పులపర్తి గ్రామ సభల్లో ఆయన పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడారు. జంపపాలెం గ్రామ సభకు మండల ప్రత్యేకాధికారి చాముండేశ్వర్రావు హాజరయ్యారు.

నక్కపల్లి: మండలంలోని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, పరిపాలనాధికారి సీతారామరాజు పాల్గొని వినతులు స్వీకరించారు.

నక్కపల్లి: మండలంలో ఉపమాకలో జరిగిన గ్రామసభలో హోంమంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి, ఎంపీ పరిశీలించారు.

గొడిచర్లలో ప్రొటోకాల్ వివాదం

గొడిచర్లలో జరిగిన గ్రామసభలో అధికారులు సర్పంచ్‌ను మాత్రమే ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడిని వేదిక మీదకు ఆహ్వానించకపోవడం, ప్రొటోకాల్ లేని మాజీ ఎంపీటీసీని ఆహ్వానించడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు, దీంతో ఎంపీటీసీని వేదికపైకి ఆహ్వానించారు.

నేడు వెంకన్న ద్వార బంధం ఏర్పాటు

మునగపాక: తిమ్మరాజుపేటలో శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ద్వార బంధం ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కుంకుమ పూజతో పాటు లక్ష్మీ నారాయణుల పూజా కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

పాయకరావుపేట: మంగవరం గ్రామంలో కొలువుదీరిన చిట్టిపైడమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం



పూడిమడక రోడ్డులో నిలిచిన వాహనాలు

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక జంక్షన్ వద్ద శుక్రవారం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం సెజ్‌కు ఉద్యోగులతో బస్సు వస్తుంది. అదే సమయంలో అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపునకు ట్యాంకర్ లారీ వెళ్తుంది. రెండు వాహనాలు మునగపాక జంక్షన్ వద్ద కృష్ణంరాజు కాలువపై ఉన్న బ్రిడ్జిపైకి చేరుకున్నాయి. దీంతో వాహనాలు తప్పించే క్రమంలో కొంత సేపు నిలిచిపోవాల్సి వచ్చింది. కొంత మంది స్థానికులు స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

ఫార్మా కార్మికులకు రక్షణ కల్పించండి



అచ్యుతాపురం జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నేతలు

మునగపాక(అచ్యుతాపురం): సెజ్‌లో పనిచేసే ఫార్మా కార్మికులకు రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ శుక్రవారం అచ్యుతాపురం జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎసైన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. వరుసగా ప్రమాదాలు జరుగుతున్నా తనిఖీలు లేవని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి భద్రతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు, దేమునాయుడు, కర్రి అప్పారావు, రామకృష్ణ, బ్రహ్మాజీ, నూకన్న, నారాయణ, చలపతి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఏపీటీఎఫ్ యూనియన్ నాయకులు

మునగపాక(అచ్యుతాపురం): జీవో నంబరు-117 రద్దు చేసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు కోరారు. శుక్రవారం ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బలోపేతం కావడంతో పాటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, మూర్తి వెంకటేశ్వరరావు, కవిత, ఫాతిమా, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌కు అందుబాటులో వైద్యం



మాట్లాడుతున్న డాక్టర్ సుభద్ర

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నేత మళ్ల కాలేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ సుభద్ర మాట్లాడారు. క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించాలన్నారు. క్యాన్సర్‌కు అందుబాటులో వైద్యం ఉందన్నారు. ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ సాధ్యమన్నారు. వైద్యులు సుదానంద, సుకన్యలు పలువురికి పరీక్షలు చేసి, క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఆశ, కాండ్రేగుల గణేష్, పల్లి జ్యోతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేద్దాం

- అదనపు ఎస్పీ దేవప్రసాద్



ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు యువత కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎం.దేవప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ప్రకాశం పంతులు 153వ జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకికెదురుగా నిబ్బరంగా నిల్చి 'కాల్చుమని' తెల్లదొరలను హడలెత్తించి 'ఆంధ్రకేసరి'గా పేరుగాంచిన మహానుభావుడు అని కొనియాడారు. నిజాయితీ, నైతిక విలువలతో కూడిన జీవనశైలి నేటి యువతకు, ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు మార్గదర్శకం అన్నారు. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి రాష్ట్ర, దేశ అభ్యున్నతికి పాటుపడాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు కె.లక్ష్మణమూర్తి, ఎస్.లక్ష్మణమూర్తి, ఎస్.ఎస్.సిహెచ్.చంద్రశేఖర్, ఎ.ఓ బి.శారద, ఎస్ఐ బి.అంజిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం



పాఠశాలలో చంద్రయాన్ నమూనాను ప్రదర్శన

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రయాన్ నమూనాను ప్రదర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం రాము మాట్లాడుతూ చంద్రయాన్‌లో భాగంగా విక్రమ్ ల్యాండర్‌ను చంద్రుడిపై దింపిన సందర్భంగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించినట్టు చెప్పారు. పాఠశాలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు.

గణపతి నవరాత్రులకు ఏర్పాట్లు చేయాలని వినతి

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున వినాయక ఘాట్ వద్ద గణపతి నవరాత్రులకు అన్ని ఏర్పాట్లు చేయాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ వ్యవస్థాపక కమిటీ చైర్మన్ ఆడారి కుమార్‌స్వామి కోరారు. కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జోనల్ కార్యాలయంలో జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌స్వామి మాట్లాడుతూ నెహ్రూచౌక్ నుంచి శారదానది ఒడ్డు వరకూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిత్యం శానిటేషన్, లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినాయక చవితి రోజున 30 నుంచి 40 వేల మంది భక్తులు మట్టి ప్రతిమలు నదిలో నిమజ్జనం చేయడానికి వస్తారన్నారు. వారికి తాగునీరు, తదితర సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొణతాల హరినాథ్‌బాబు, సుంకర చంద్రం, దాడి బుజ్జి, ఆడారి రవి, బొబ్బిలి సురేష్, పి. వరప్రసాద్, బి. జనార్దన్ పాల్గొన్నారు.

రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్‌గా రమణాజీ

అనకాపల్లి: అనకాపల్లి మర్చంట్ అసోసియేషన్ వెంకటస్వామి నాయుడు రోటరీ కంటి ఆస్పత్రి చైర్మన్‌గా బుద్ద రమణాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక న్యూకాలనీ రోటరీ కంటి హాల్లో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సరిపల్లి రాజేష్, కార్యదర్శిగా దేవత అనిల్, టెక్నికల్ పర్సన్స్‌గా పి.రాజేష్‌నాయుడు, కె.కుష్వంత్, కె.సతీష్, కుమార్, మల్లేశ్వరరావు, సాత త్రినాథ్, దుర్గాప్రసాద్, కమిటీ సలహాదారులుగా వి.రవిరాంజవహర్, పి.రాజేశ్వరిప్రసాద్ ఎన్నికయ్యారు.